# ఆడబ్రతుకు

శ్రీ ఆళ్ల పిచ్చయ్య

"ఛీ ముండా, యింట్లోనుండి వెళ్ళిపో, ఎద్దులాగు న్నావ్. ఆమాత్రం పిల్లాణ్ణి ఆడించలేవూ?"

"..................."

"సిగ్గుంటేగా పాడుముఖానికి. ఎన్ని తిట్టినా దున్నపోతుమీద వర్షం కురిసినట్లే. ఏం, ఏమాయరోగం వచ్చింది. పైగా ఏడుస్తున్నావ్. తిని బలిసిందిచాలమా? విడిచిపెట్టింది చాలు మానంగం. జన్మయితే ఏ రంకు మొగుణ్ణన్నా కట్టుకోపోయావు హాయిగా వుండొచ్చు."

"ఎందుకండీ అలాంటి మాటలు. మీకంటె నాకింక దిక్కెవరండీ. పిల్లవాడు ఏడ్పు ఎంతసేపటికి చాలించకపోతే నేనేమి చెయ్యనండి? నన్ను చావమంటారా?"

"చస్తే మేలే, భూదేవికన్నా భారం తగ్గుతుంది."

"ఎందుకండీ, నేనేమి తప్పుచేశానండి. హృద్రోగముతో క్రుంగి కృశించిపోతుంటె, యింకా నన్నెందుకండి సాధిస్తారు" అని బావురమని యేడ్చింది అనాథ యువతి రోజా.

"ఛీ, వెధవముండా! పండుగనాడు యింట్లో నీ గోలేమిటి? ఇంటికి శనిలాగ దాపరించావు" అంటూ సారామత్తులోవున్న వెంకటేశ్వర్లు కోపంతో రోజాను కిందకుయీడ్చి, కాలితో తన్నాడు.

"నీకేం పొయ్యేకాలం వచ్చిందే ముండా, నా యింట్లో నీ యేడ్పేమిట'ని వెంకటేశ్వర్లు ఉంపుడుకత్తె సరస్వతి చెంబుతో రోజా నెత్తిన మొత్తి, జుట్టుపీకి, చెంపలు వాయించింది.

"పాపిష్టిముండ! ఫో, యింట్లోనుండి వెళ్ళిపో, అంటూ ఆ పతివ్రత మంగళసూత్రాన్ని త్రెంపి, నొసల మధ్య మంగళంగా మెరిసే, కుంకుమ రేఖను తుడిచి, బయటకునెట్టి తలుపువేశాడు, ఆ భారత నారీమణి అశ్రుప్లుత నేత్రాలనుండి కన్నీరు కాల్వలై కట్టుతూ వుంటె, గాయాలనుండి వేడి రుధిరం పైకి చిమ్ముతూ, కిటికీలోని మిణుకు మిణుకుమంటున్న జ్యోతికాంతిలో డేంజరు లైటులా మెరుస్తుంటె, మతితప్పి పడిపోయింది.

ఆనాడు దీపావళి. అందరు వారి చీకటి జీవితములలో నూతన శుభ్రదీపికలను వెలిగించుకుంటున్నారు. మునిసిపాలిటీ గంట తొమ్మిదికొట్టింది. వెంకటేశ్వర్లు ఉంపుడుకత్తె సరస్వతితో నవ్వుతూ ఆమెచే కాకర పువ్వొత్తులు కాల్పిస్తున్నాడు. ఇంటిలోపల రోజా మంచాలువేసి, తనకు వెన్నెలరోజులు రానందుకు దుఃఖిస్తూ కూర్చున్నది. ఇంతలో సరస్వతి తన బిడ్డ ఏడుస్తుంటె, ఆడించమని రోజా చేతికిచ్చి మళ్ళీ మందులు కాల్చడానికి వెళ్లింది. ఆబిడ్డ తన సవతి కొడుకు. తన సవతి తన పతి హృదయంలో తన పవిత్రప్రేమ జ్యోతినార్పి, ఆమె కపటవలపు జ్యోతిని వెలిగించింది. తను మానవతి. దుఃఖం ఎడదంగలోనుండి పొర్లివచ్చింది. ఆపుకోలేక బావురమని యేడ్చింది. బిడ్డ ఏడ్పు మానలేదు. ఆ బిడ్డంటే ఆమెకు మాతృప్రేమ. జోలపాట పాడింది. కాకి అరుపు అరిసింది. చప్పట్లు కొట్టింది. కాని బిడ్డ యేడ్పుమానలేదు. వెంకటేశ్వర్లుకు కోపం వచ్చింది. తిట్టి కొట్టి బయటకు నెట్టాడు.

అసలు వెంకటేశ్వర్లు అనాగరికుడు. జీవనం లెక్కలమీదనే. దుశ్చేష్టలు అతడు కోరిన పనులు. సారాయిగ్లాసు అతని ప్రాణమిత్రుడు. అతడు తాళి కట్టిన భార్య రోజా. ఫుల్లకమల తుల్యమైన మెరిసే దేహం, నెమలి కంఠంలాంటి మెడ, మనల్ని మురిపించే చకచకలాటి నయనాలు, నొసలమధ్య నల్లటి మచ్చ, నవ్వితే చొట్టలుపడే చెక్కిళ్లు, గజదొంగలాంటి ఎత్తయిన కోలగుబ్బలు—నిజంగా ప్రకృతి సౌందర్యమంటే ఏమిటో రోజాద్వారా మనం తెలుసుకోవచ్చు. కాని వెంకటేశ్వర్లు కర్కశ హృదయంతో వివాహం తాలూకు వెయ్యిరూపాయలు రావాలని మామ కోటీశ్వరరావుని అడిగాడు. మామ మళ్లీ యివ్వలేనన్నాడు. లేకపోతే తల్లిలేని తన భార్యను విడిచిపెట్టుతానని బెది

రించాడు వెంకటేశ్వర్లు. అసహాయస్థితిలోనున్న కోటీశ్వరరావు తానిక యివ్వలేనన్నాడు. అలా అయితే నీ బిడ్డను నీవే తీసుకోమని, ఆమెను తన దురాశకు బలి చేసి, విడిచిపెట్టాడు వెంకటేశ్వర్లు. తెలిసిన రోజా భర్తగృహం విడిచి రానన్నది. కోటీశ్వరరావు మనోరోగంచేత మంచంపట్టి, మట్టిలో కలిసిపోయాడు. వెంకటేశ్వర్లు పణ్యాంగన సరస్వతిని స్వీకరించాడు. అభిరూపచ్ఛాయలు ఆమెలో మృగ్యమయినా, పైపై మెరుగులు ఎక్కువ. ఆమెయింట్లో కాలిడినప్పటినుండీ రోజా జీవితంలో కృష్ణపక్షరోజులు ప్రారంభమయినాయి. తుదకు ఆమె పవిత్రజీవితము అమావాస్యగా మారింది. ఆమెది కత్తితో కలచివైచిన హృదయం. ఇంట్లో పనులెల్ల చక్కపెట్టడం, చేతులుకందినా నీళ్లు తోడడం, సవతి బిడ్డను ఆడించడం, సరస్వతికి పరుపు వేసి, ఆమె పరుండిన తరువాత ఆమె కాళ్లు ఒత్తడం యీమె దినచర్య. ఆమె ఆయింటి దాసీగా మారింది. చీటికిమాటికి వెంకటేశ్వర్లు తిట్లు తప్పేవి కావు. సరస్వతి ఆమెను యీడ్చి, తన్నుతూ వుండేది. సరస్వతి తను మరిగిన విటులకు, వెంకటేశ్వర్లు యింటిలో లేనప్పుడు, రోజాను శరీరాన్ని అమ్ముకోమని బరాత్కరించేది. కొత్త ఫలం రుచి పాతఫలానికి వుండదని బుద్ధులు నేర్పేది. రోజాకు చెప్పుకోనే దిక్కెవరూ లేరు. వెంకటేశ్వర్లు సరస్వతి బంటు. దీనవదనంతో కృష్ణవిగ్రహాన్ని హృదయంలో దాచుకుంటూ, కృష్ణయ్యా, నాజీవితము యిక యింతేనా' అంటూ బావురుమని యేడ్చేది. ఆత్మహత్యను ఆత్మప్రబోధమువలన మానేది.

మతి తప్పిన రోజా వాడిన అరటి దొప్పలులాంటి కనురెప్పలను విప్పింది. ముఖంనిండా రుధిరధారలు గడ్డగట్టినాయి. లేచి వెర్రిగా లోకంవంక చూసింది. ప్రకృతిగానం భయంకరంగా వినిపిస్తూవుంది. ఉత్తరంగా శ్మశానంలో భైరవ అరుపులు ప్రకృతి గానానికి తాళం వేస్తున్నాయి. ప్రమిదలలోని జ్యోతులన్నీ ఆరిపోయాయి. ఆకాశకన్య రక్కలనే కుటుపువ్వుల నీలి చీరను ధరించింది. విభావరీయువతి ఎందుకో మూల్గుతుంది. ప్రకృతి అర్ధరాత్రిమును సూచిస్తుంది. ఆమె వీధి వెంబటి నడవలేక నడుస్తూ వెళ్ళి, ఒక అరుగుమీదపడి పోయింది. పరీక్షల మూలాన అప్పటివరకు మేల్కొని 'మేకప్' పూర్తిచేసి, విశ్రాంతి కొరకు బయటకు వచ్చాడు 'అనిశెట్టి'. అంధకారంలో కదులుతూవుంది ఆ దీనురాలు. గబగబ గదిలోకి వెళ్లి 'లాంప్' తెచ్చి ముఖంవంక చూశాడు. ఆమె బెదిరివుంది. ఆమెను ఎలాగో గదిలోకి చేర్చి, 'స్టౌ' మీద కాగుతున్న 'టీ' నాలుగు 'కోవా' ముక్కలిచ్చి, ఆమె సేద తీర్చాడు. ఆమె కృతజ్ఞతగా అతనువంక చూసింది.

'అనిశెట్టి' అందగాడు. తన కుంచెనుండి దివ్యచిత్రరచనలను వెలువరించే ఉత్కృష్ట చిత్రకారుడు. కవనకన్యను ప్రేమించిన ప్రేమికుడు. అత్యుత్తమ సినిమా వ్యాసములు రాసి, ప్రఖ్యాతి గడించిన సినిమాకళోపాసకుడు. సినిమా కళకు తన హృదయాన్ని అంకితం యిచ్చాడు. అతని అవయవాలు 19 ఏండ్లనుండీ పెరుగుతున్నాయి. అతడు ధనవంతుడు. కాని వేషాలలో 'సింపిల్'గా వుంటాడు. గుంటూరు క్రిస్టియన్ కాలేజీలో బి. ఎ. చదువుతున్నాడు. కాని అతనివి మాటిమాటికి మారే మనస్సు. కొత్తకాలెండరు వచ్చింది. ఆమె 'అనిశెట్టి' గదిలోనే వుంటూవుంది. ఆమె తన దీనచరిత్రను అతనితో చెప్పుకుంది. ఆ మగ హృదయం 'అయ్యో, పాపం,' అంది. తన ఎడదగుడిలో ఆమె విగ్రహాన్ని నిలపడానికి యిష్టమేనాయని ఆమెను అడిగాడు. తన హృదయంలో కళంకమున్నదే హూ కాగడాతో వెదుకనున్నది రోజా. అతడు సామ్యవాది కాబట్టి, మరుసటి దినంనుండీ స్వేచ్ఛగా లోకంతో కలిసివుండమని కోరాడు. ఆమెకు పలుభాషలు నేర్పాడు 'అనిశెట్టి'. ఆమె ప్రపంచ నాగరికత నేర్చుకుంది. అతడు కాలేజీకి వెళ్లేసమయాన యింటిని చక్కగ అలంకరించి, పని లేనప్పుడు గ్రంథాలు చదువుతూ వుండేది. ఇప్పుడు ఆమెజీవితము వెన్నెలరేఖలతో నిండివుంది. 'అనిశెట్టి' మిత్రులు అనేకమంది ఎప్పుడూ అతని యింటికి వస్తూవుండేవారు. వారిని గౌరవంగా సత్కరించేవారు ఆ ప్రేమమయులు. ఆంజనేయులు మాత్రం చాలా తరచుగా వస్తూవుండేవాడు.

ఆంజనేయులు మోహాంధుడు. స్నిగ్ధతేజంతో మెరిసే ఆయశోవతి దేహాన్ని తుచ్ఛంగా కోరాడు. 'అనిశెట్టి'యింటికి వచ్చినప్పుడెల్లా కోతిచేష్టలు చేస్తూ, వెధవ భయంకరచూపులతో బాబురావ్ పెండార్కర్ పోజు పెటుతూవుండేవాడు. 'అనిశెట్టి' యింటివద్ద వుండడని తెలుసుకొని అతని యింటికి వెళ్ళాడు. యధాప్రకారంగా ఆమె 'టీ' యిచ్చి గౌరవించింది. అతని మాటల ధోరణి వింతగా అగపడింది ఆమెకు. అమాంతంగా ఆమె నోరునొక్కి, ఆమెను నగ్నంగా చేసి, సోఫాలో ఆమెను బలాత్కరించడం మొదలిడినాడు. ఆమె రోషంతో అతని జుట్టు, ముఖాన్ని పీకింది, తిట్టింది. రక్తం కారుతున్నా ఆ కామాంధుడు పట్టు వదలలేదు. తలుపు గడియవేయడం మరిచాడు ఆంజనేయులు. ఇంతలో 'అనిశెట్టి' తలుపుతెరచుకొనిలోన ప్రవేశించాడు. ఆమె ఆంజనేయులు కౌగిటిలో బంధించబడివున్న దృశ్యాన్ని కనులార చూశాడు. 'అనిశెట్టి'ని చూడంగానే వెర్రిగా నవ్వుతూ, తూలుతూ వెళ్ళాడు ఆంజనేయులు.

రోజా తన మానభంగానికి కుమిలిపోతూవుంది. 'అనిశెట్టి'కి తల దిమ్మెత్తిపోయింది. మండుతున్న హృదయంతో 'యిదా ప్రతిఫలం' అంటూ గొణిగాడు. లోకం అతనివంక చూసి నవ్వుతున్నట్లగపడింది అతనికి. ఆమెను చూస్తే అసహ్యం పుట్టింది. పదిరాత్రులు గడిచాయి. నాటిరాత్రి అతడు రోజాతో కులాసాగా మాటాడడం మొదలిడినాడు. కాని ఆమాటల్లో ఆవేదన అగపడుతూవుంది. గోడనున్న ఫోటో భయంకరంగా కనిపిస్తూవుంది. మాటల మధ్యలో ఆమెకు 'పొటాసియం సైనేడ్' కలిపిన కిల్లీయిచ్చాడు. ఆమె ఆనందంతో మ్రింగింది. మరుక్షణమే క్రిందపడిపోయింది. ఆమె మెడను మెలితిప్పాడు 'అనిశెట్టి' కాఠిన్యంతో. అంతే నిండు జ్యోతి ఆరింది. బండివాని సహాయంతో ఆమెను పూరిబయట పాతిపెట్టాడు. అప్పుడే నీలాలనింగి నుండి తారొకటి రాలింది.

మీరు చదివారా?

విఖ్యాత నవలాకారుడు

**శరశ్చంద్రుని**

నవలలు

* బాపనపిల్ల * సర్వేశు వీలునామా
* తీరని కోరికలు * రాముని బుద్ధిమంతనం

ఒక్కొక్కటి అణాలు

*

కీ॥ శే॥ గురజాడ వెంకట అప్పారావు పంతులుగారి
కొండుభొట్టీయం - హాస్యరస నాటకం 0-6-0
ముత్యాల సరములు - చిన్న కథలు 0-4-0

వి. పి. చార్జీ ప్రత్యేకం.

*

నేడే ఆర్డరు చేయండి!

నవయుగ కార్యాలయం,
బుక్ సెల్లర్సు, పబ్లిషర్సు: న్యూస్ ఏజెంట్సు,
విజయనగరం సిటీ.

## కథలు కావాలి!

కథాంజలికి చక్కని రసవత్తరమైన కథలు కావాలి. కథలు అనుకరణాలు అనువాదాలైనా పరవాలేదు.

కథలు పంపేవారు విడివిడి అక్షరాలతో ఒకే ప్రక్క వ్రాసి పంపాలి. కథలు ప్రతి నెలా 20 వ తేదీలోగా మా కార్యాలయం చేరాలి.